# దురాశ వల్లే కాళేశ్వరం సంక్షోభం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** బీఆర్ఎస్ తప్పిదాల వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు నిరుపయోగంగా మారాయని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సెక్రెటేరియట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మీ బ్యారేజ్), అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదులు నిర్మాణపరంగా తీవ్ర అనుమానాస్పద స్థితిలో ఉన్నాయని.. శాస్త్రీయ పునరుద్ధరణ పూర్తయి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ), సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) అనుమతులు లభించే వరకు వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్వహించబోమని స్పష్టం చేశారు. మేడిగడ్డలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ద్వారా నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. పంపులను ఆన్ చేసే పరిస్థితి లేదని.. పంపులను నడపలేమని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలను నిర్వహించవద్దని ఎన్‌డీఎస్‌ఏ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. రైతులను, ప్రజలను తప్పుదోవ పట్టించేలా బీఆర్ఎస్ నేతలు అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ సమస్యను సాధారణ ఆపరేషన్ సమస్యగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇది రాజకీయాల అంశం కాదని.. ఇంజినీరింగ్, ప్రజల భద్రతకు సంబంధించిన అంశమని అన్నారు. గత ప్రభుత్వం ప్రాజెక్టును, బ్యారేజీలను ఇంజినీరింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించి ఉంటే ఇప్పుడు ఉత్తర తెలంగాణలో సాగునీటి అనిశ్చితి ఉండేది కాదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును అమలు చేసి ఉంటే ఉత్తర తెలంగాణకు సుమారు 80 టీఎంసీల స్థిర నీటి లభ్యత ఉండేదని.. ఎల్‌నినో వంటి పరిస్థితుల్లోనూ ఆ ప్రాంతానికి భరోసా కలిగేదని తెలిపారు. అయితే.. రాజకీయ, వాణిజ్య ప్రయోజనాల కోసం ప్రాజెక్టు రూపకల్పనను మార్చడం వల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు.




### దురాశ వల్లే కాళేశ్వరం సంక్షోభం..

దురాశ, స్వల్ప దృష్టి, తప్పుదారి పట్టిన నిర్ణయాల ఫలితమే కాళేశ్వరం సంక్షోభమని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ప్రకారం మూడు బ్యారేజీల పునాదుల్లో సీకెంట్ పైల్ కట్‌ఆఫ్ వాల్‌లలో లోపాలు, సీపేజ్, పైపింగ్, స్టిల్లింగ్ బేసిన్‌ల బలహీనత, ఎనర్జీ డిసిపేషన్ వ్యవస్థల్లో లోపాలు, నీరు చొరబడకుండా ఉండాల్సిన నిర్మాణాల్లో వైఫల్యాలు, నిర్మాణ నాణ్యత లోపాలు ఉన్నట్లు గుర్తించిందని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీలోని బ్లాక్7 పునాదుల కింద ఖాళీలు ఏర్పడటంతో కుంగిపోయిందని.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ఇలాంటి లక్షణాలు ఉన్నాయని వెల్లడించారు. సమస్య ఒక్క పియర్‌కో, ఒక్క గేటుకో పరిమితం కాలేదని.. మొత్తం పునాది వ్యవస్థ సమగ్రతే ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. అవసరమైన మరమ్మతులు చేయకుండా బ్యారేజీల్లో నీటిని నిల్వ చేస్తే తీవ్ర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నదని.. దిగువ ప్రాంతాలైన భద్రాచలం సహా అనేక ప్రాంతాలు ముంపును ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. పునరుద్ధరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయ విధానాన్ని అనుసరిస్తున్నదని మంత్రి తెలిపారు.

### 2027 ఆగస్టు నాటికి పూర్తిచేస్తాం..

మూడు బ్యారేజీల్లో గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) సర్వేలు, 80 మీటర్ల లోతు వరకు దాదాపు 100 బోర్‌హోల్స్, ప్రయోగశాల పరీక్షలు, పారగమ్యత అధ్యయనాలు, హైడ్రాలిక్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఫ్లూయిడ్ డైనమిక్స్ (సీఎఫ్‌డీ), డిజిటల్ ట్విన్ సిమ్యులేషన్లు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ వివరించారు. ఈ అధ్యయనాలను సీడబ్ల్యూపీఆర్ఎస్ పుణె, గ్లోబల్ కన్సల్టెంట్ ఏఎఫ్ఆర్వై, ఐఐటీ బాంబే సంయుక్తంగా ఎన్‌డీఎస్ఏ, సెంట్రల్ వాటర్ కమిషన్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నాయని చెప్పారు. ప్రాథమిక నివేదికల ప్రకారం మూడు బ్యారేజీలకు నిరంతర డయాఫ్రాగం వాల్‌లు నిర్మించడం, స్టిల్లింగ్ బేసిన్‌లను బలోపేతం చేయడం అవసరమయ్యే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో పరీక్షలు, డిజైన్ల ఖరారు ప్రక్రియ పూర్తవుతుందని.. వరదలు తగ్గిన వెంటనే పునరుద్ధరణ పనులు ప్రారంభించి 2027 జూలైఆగస్టు నాటికి మూడు బ్యారేజీల పనులు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. అప్పటి వరకు మూడు బ్యారేజీలు ఫ్రీఫ్లో స్థితిలోనే కొనసాగుతాయని స్పష్టం చేశారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణ సమస్యలను ఇతర ప్రాంతాల్లో చోటుచేసుకున్న గేట్ల వైఫల్యాలతో పోల్చడం సరైంది కాదని అన్నారు. గేటు దెబ్బతినడం ఒక సమస్య అయితే.. బ్యారేజీ పునాది దెబ్బతినడం పూర్తిగా భిన్నమైన ఇంజినీరింగ్ సమస్య అని పేర్కొన్నారు. ఘోష్ కమిషన్ నివేదికలోనూ కాళేశ్వరం ప్రాజెక్టు అమలులో తీవ్రమైన విధానపరమైన, ఆర్థిక అవకతవకలు జరిగినట్లు వెల్లడైందని ఉత్తమ్ అన్నారు. మంత్రివర్గ ఆమోదం, డీపీఆర్ లేకుండానే పనులు ప్రారంభించి, అనంతరం ప్రాజెక్టు వ్యయం భారీగా పెంచారని అన్నారు. ఈ అంశాలపై ఇప్పటికే సీబీఐ విచారణ కోరినట్లు తెలిపారు. మరోవైపు ఉత్తర తెలంగాణకు దీర్ఘకాలిక సాగునీటి భద్రత కల్పించేందుకు తుమ్మిడిహెట్టి నుంచి సుమారు 80 టీఎంసీల నీటిని తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. ఇందుకు సంబంధించిన డీపీఆర్ రూపొందించే బాధ్యతను ఆర్వీ అసోసియేట్స్‌కు అప్పగించామని.. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపి తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంపై ముందుకు సాగుతామని వెల్లడించారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విపత్తు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ప్రముఖ టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, ఈఎన్సీ (జనరల్) రమేశ్‌బాబు, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు ఇంకో న్యాయమా?

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆ పార్టీ తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న రాజకీయ అండతోనే ఒవైసీ బరితెగించి మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలను కూడా గౌరవించకుండా, హైకోర్టునే బెదిరించేలా ఒవైసీ వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. అడ్డగోలుగా తప్పులు చేస్తూ మళ్లీ హైకోర్టునే ప్రశ్నిస్తారా? అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం నేతలకు కోర్టులు అన్నా, చట్టాలు అన్నా అస్సలు గౌరవం లేదని ధ్వజమెత్తారు. చెరువులను ఆక్రమించుకుని విద్యాసంస్థలను నిర్మించడమే ఒక పెద్ద తప్పని, దీనిపై హైకోర్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఒవైసీ ఎందుకు జాప్యం చేస్తున్నారని బండి సంజయ్ ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ఫాతిమా విద్యా సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నోరెదపడం లేదని ఆయన నిలదీశారు.

### బీజేపీ వస్తే కూల్చివేతలు ఖాయం..

గండిపేట ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న విద్యా సంస్థలకు కూల్చివేస్తామంటూ నోటీసుల మీద నోటీసులు ఇస్తున్న ప్రభుత్వం.. ఒవైసీ ఆధ్వర్యంలోని ఫాతిమా విద్యా సంస్థల జోలికి ఎందుకు వెళ్లడం లేదు? ఒవైసీకి ఒక న్యాయం.. ఇతరులకు ఇంకో న్యాయమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఒవైసీ నేతృత్వంలోని సదరు విద్యా సంస్థ గతంలో మిలిటెంట్లకు షెల్టర్ ఇచ్చింది నిజం కాదా? అని బండి సంజయ్ సంచలన ఆరోపణలు చేశారు. అక్కడ విద్యార్థులకు చదువు చెప్పే ముసుగులో మిలిటెంట్లను తయారు చేస్తున్నారా? అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో రేపు బీజేపీ అధికారంలోకి రాగానే అక్రమంగా కట్టిన ఫాతిమా విద్యా సంస్థలను కూల్చివేస్తామని బండి సంజయ్ స్పష్టం చేశారు. అక్రమార్కులకు, అవినీతిపరులకు భయమంటే ఏమిటో చూపిస్తామన్నారు. అయితే, ఆ విద్యా సంస్థల్లో చదువుకుంటున్న అమాయక విద్యార్థుల భవిష్యత్తు చెడిపోకుండా, వారికి ప్రభుత్వం తరపున ప్రత్యామ్నాయ విద్యావకాశాలను చూపిస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

## ఘనంగా ప్రపంచ మెకానిక్స్ దినోత్సవం

### రక్తదానంలో పాల్గొన్న టూ వీలర్ మెకానిక్స్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని టు వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి అన్నారు. ప్రపంచ మెకానిక్ దినోత్సవం సందర్భంగా వనస్థలిపురం టూ వీలర్ మెకానిక్స్ ఆటోమొబైల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎల్ బినగర్ లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ రక్తదాన శిబిరంలో హయత్ నగర్, వనస్థలిపురం హస్తినాపురం బి.యన్.రెడ్డి నగర్ టూ వీలర్స్ మెకానిక్స్ పాల్గొని రక్తదానం చేశారు. మిత్ర బ్లడ్ బ్యాంక్ వైద్య బృందంచే రక్తదానం సేకరణ చేశారు రక్తదానం చేయడం వల్ల ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని వారు తెలిపారు. సుమారు 50 మంది పైగా పాల్గొని రక్తదానం చేశారు. టూ వీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం గర్వకారణంగా ఉందని అధ్యక్షుడు అరవింద్ పేర్కొన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, టిఆర్ఎస్ పార్టీనాయకులు చింతల రవి ,వనస్థలిపురం ఇన్స్పెక్టర్ ,అసోసియేషన్ కార్యదర్శి మోయిన్, కోశాధికారి నరేందర్ రెడ్డి, ఆర్గనైజర్ నరసింహయాదవ్, అడ్వైజర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా బ్రహ్మోత్సవాలు




**విశ్వంభర, చైతన్యపురి :** గడ్డి అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 2వ పుష్కర బ్రహ్మత్సవ 6 వరోజు ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ , రుద్వికులు వేద పండితులచే ఉదయం హోమము, 108 వెండి కళిశాలతో అభిషేకము పుష్కర శిఖర అభిషేకము, ఆలయ ధర్మ కర్తలకి భక్తులకు చక్ర స్నానము ఘనంగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి భేరి పూజ 12 రకల ప్రసాదములు ఋత్వికులకు సత్కారము ,ఆలయ చైర్మన్ కమిటీ సభ్యులు ధర్మకర్తలకు దాతలకు సత్కారము. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేవరం లింగారెడ్డి, ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్య, కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు పాల్డి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్, మాజీ చైర్మన్ సూరిశెట్టి వీరేశం, చిదర నాగేందర్, బచ్చు సత్యనారాయణ, ప్రొద్దుటూరి కుమారస్వామి, మరియు భక్తులు ప్రొద్దుటూరి వేణు, ఊర శ్రీనివాస్, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పదవి లేకున్నా కాంగ్రెస్ కోసం పని చేస్తా

### - కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**విశ్వంభర, చౌటుప్పల్ :** 'నాకు పదువులిచ్చినా, ఇవ్వకున్నా రాహుల్‌గాంధీ నాయకత్వంలో పని చేస్తా, నేను కాంగ్రెస్ పార్టీకి దూరంగా లేను' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. చౌటుప్పల్‌లో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర నేత్రాలయ, ఫీనిక్స్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు.అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ''కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం, కార్యకర్తలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నాను. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే ఏం చేయాలి.. ఇచ్చిన హామీలను ఎంత వరకు నెరవేర్చాం.. ప్రజల మనసులను గెల్చుకునేందుకు ఇంకేం చేయాలి.. ప్రభుత్వం నుంచి వాళ్లేం ఆశిస్తున్నారు అని నిత్యం ఆలోచిస్తున్నాను. మొదట్నుంచీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న కార్యకర్తలు చాలా మంది ఉన్నారు. వాళ్లకు అన్యాయం జరుగకూడదనే తప్పనిసరి పరిస్థితుల్లో యాదగిరిగుట్ట దేవస్థాన కమిటీ గురించి మాట్లాడాల్సి వచ్చింది. అది పార్టీకి వ్యతిరేకం చేయాలనో, ముఖ్యమంత్రికి వ్యతిరేకమో, ప్రభుత్వానికి చెడ్డ పేరు రావాలనో అలా మాట్లాడలేదు. నేను ఇటీవల రాహుల్‌గాంధీని కలిశాను. ఆయన నాకిచ్చినంత సమయం తెలంగాణ రాష్ట్రంలో ఇంకెవ్వరికీ ఇచ్చి ఉండరు. పార్టీ, ప్రభుత్వ పనితీరుపై, నా కుటుంబ నేపథ్యం గురించి అడిగారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం ఎలా.. ఏం చేస్తే బాగుంటుందని అడిగారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలనే లక్ష్యంతో నేను పని చేస్తా'' అని అన్నారు.





నాగోల్ బండ్ల గూడలోని దేవకి కన్వెషన్ హాల్లో వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు అశిష్ - దివ్యలను ఆశీర్వదిం చిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ తదితరులు






తెలంగాణ ఉద్యమ పోరాటంలో పాల్గొన్న వికలాంగులకు నియామకపత్రాలు అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ

## ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి.. బంధువుల ఆందోళన

**విశ్వంభర, జహీరాబాద్ అర్బన్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో నవజాత శిశువు మృతి చెందింది. ప్రసూతి సమయంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే బిడ్డ ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఝరాసంగం మండలం పొట్‌పల్లికి చెందిన గర్భిణి మనోహరను మొదటి కాన్పు కోసం కుటుంబ సభ్యులు ఏరియా ఆసుపత్రిలో ఆదివారం చేర్పించారు. సాధారణ ప్రసవం జరిగినప్పటికీ.. శిశువు పుట్టగానే వైద్యులు, సిబ్బంది పట్టించుకోకుండా జాప్యం చేశారని బంధువులు ఆరోపించారు. బిడ్డ ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నప్పుడు ఆక్సిజన్ పెట్టాలని కోరినా.. కాలయాపన చేయడంతోనే వైద్యం అందక చనిపోయిందన్నారు.



### కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే..

విషయం తెలుసుకున్న జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ శివకుమార్ ఆసుపత్రికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. బాధిత కుటుంబంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండకపోవడాన్ని తప్పుబడుతూ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. శిశువు మృతికి కారకులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలోని వైద్యుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు.

## కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో త్వరలో ఉత్పత్తి ప్రారంభిస్తాం: రైల్వే బోర్డు చైర్మన్

**విశ్వంభర, కాజీపేట:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురంలో నూతనంగా నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో త్వరలో ఉత్పత్తిని పారంభిస్తామని, భవిష్యత్తులో దేశానికి అవసరమయ్యే నెక్స్ జెన్ కోచ్‌లను తయారు చేస్తామని రైల్వే బోర్డు చైర్మన్, సీఈఓ సతీష్‌కుమార్ అన్నారు. ఆయన ఆదివారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీవాస్తవతో కలిసి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్)ని పరిశీలించారు. ఆర్వీఎన్ఎల్ అధికారులు ఆయనకు ముందుగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫ్యాక్టరీ నిర్మాణం గురించి వివరించారు. మెయిన్ షెడ్, బోగీషాపు, పెయింట్ షాపు, వీల్‌షాపు, టెస్టింగ్ షాపులను తనిఖీ చేశారు.సతీష్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. ఫ్యాక్టరీకి అవసరమైన యంత్రాలను సిద్ధం చేశామని, వాటి పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. విభిన్న రకాల కోచ్‌ల తయారీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆర్ఎంయూలో స్థానికులకు ఉద్యోగాల కల్పనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. అధికారులతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలను, అమృత్‌భారత్ పనులను పరిశీలించారు. అనంతరం ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీరింగ్, టెలీకమ్యూనికేషన్స్‌ను సందర్శించారు. అక్కడ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యాంటీ కొలిజన్ సిస్టమ్ 'కవచ్ 4.0' అమలు తీరును తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్వీఎన్ఎల్ జనరల్ మేనేజర్ ఆనంద్ చకీల, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీరు మల్లికార్జునరావు, సికింద్రాబాద్ డివిజినల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణ ఉన్నారు.



## బాలాలయంలోకి సరస్వతి అమ్మవారు

**విశ్వంభర, బాసర :** నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ప్రధానాలయంలో ఉన్న సరస్వతి, లక్ష్మీ మహంకాళి అమ్మవార్లతోపాటు ఆలయంలో ఉన్న దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి బాలాలయంలోకి తరలించారు. అనంతరం మహా హారతిని ఇచ్చారు. అంతకుముందు ప్రధాన దేవాలయం నిర్మాణానికి దాత.. ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి భూమి పూజ చేశారు. అనంతరం బాలాలయంలో అక్షరాభ్యాసాలు, ప్రత్యేక పూజలు ప్రారంభించారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**విశ్వంభర, సరూర్ నగర్ :** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మారయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తపోవన్ కాలనీ, వింటేజ్ వైన్స్ సమీపంలో ఒక గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సరూర్‌నగర్ పోలీసులకు 'డయల్ 100' ద్వారా సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ ఒక గుర్తుతెలియని పురుషుడు నేలపై అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించి, దగ్గరగా వెళ్లి పరీక్షించగా, అతను అప్పటికే మరణించి ఉన్నట్లు నిర్ధారించారు. మృతుడి గుర్తింపు వయస్సు సుమారు 35 నుండి 40 ఏళ్లు ఉంటుంది అని తెలిపారు. కుడి చేతిపై "అమ్మ" అని రాసి ఉన్న పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీకి తరలించడం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు సరూర్‌నగర్ పోలీసులను సంప్రదించాలని తెలిపారు.




రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించే మాలి సాగర్ రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భముగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ బాధ్యులు మల్లికార్జున్ రెడ్డి, ముందడి వెంకట్ రెడ్డి ,శ్రీధర్ రెడ్డి, బద్రి నారాయణ తదితరులు.

(విశ్వంభర, సికింద్రాబాద్)

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108